మరుక్షణం దానినుంచి ఆవిర్లు చిందాయ్.

"హహ్వాహ్వాహ్వ ..... " లోకం దద్దరిల్లేటట్లు నవ్వాడతను.

తెరలు తెరలుగా ..... విజయగర్వంతో, ఆనందాతిశయంతో.

తరువాత ఆ బొమ్మని గొయ్యితీసి పాతిపెట్టాడు. ఎముకతో ఆ ప్రదేశం మీద మూడు గీతలు గీసి లేచాడు. గాలి హోరు క్రమక్రమంగా తగ్గిపోయింది. అతను ఆరడుగులపైనే పొడవున్నాడు. అర్ధనిమీలిత నేత్రధారుడు. అతని వయసు అరవై ఏళ్ళుంటాయ్.

అనుకున్న కార్యం విజయవంతంగా ముగించుకుని పెద్ద పెద్ద అంగలతో ఆ ప్రదేశాన్ని విడిచిపెట్టాడు.

*　　　*　　　*　　　*　　　*

"ఐయామ్ లెనిన్! సోవియట్ యూనియన్ ఫౌండర్" గంభీరమైన స్వరంతో అంటూ అభిరాం, వరప్రసాదంల వంక క్షణం చూసి, మొహం తిప్పేసుకున్నాడు మహదేవ్.

"ఏం చేద్దాం?" భయపడుతూ అన్నాడు అభిరాం. ఆ భయం మహదేవ్ ఏమైపోతాడోననే.

"అవునూ! మహదేవ్ శరీరం నుంచి నెత్తురు చిందుతోంది. అది ఆగటంలేదు చూడండి అభిరాం" భయాందోళనలతో అన్నాడు వరప్రసాదం.

అప్పుడు చూశాడు అభిరాం. మహదేవ్ బుగ్గలనుంచీ, చేతులనుంచీ కారుతున్న రక్తం ఆగటంలేదు. అలా ధారలుగా కారుతూ అతను కూర్చున్న పక్కంతా ఎర్రగా నెత్తుటి ముద్దలా తయారవుతోంది.

ఆ ఘోర దృశ్యం చూడలేకపోయారిద్దరూ.

"ముందు అతనికి రక్తం కారటం ఆపాలి మనం. లేకపోతే అతను మనకు దక్కడు" ఆందోళనగా అన్నాడు వరప్రసాదం.

అతనలా అన్నప్పుడు అపోలో హాస్పిటల్‌లో మహదేవ్‌కి ట్రీట్ చేసిన డాక్టర్ గుర్తొచ్చాడు అభిరాంకి. గబగబా పర్సులోంచి అతని విజిటింగ్ కార్డ్ తీసి ఫోన్ చెయ్యటానికి పరిగెత్తాడు.

వరప్రసాదం మళ్ళీ తలుపులు మూసి హాల్లోకొచ్చి కూర్చున్నాడు.

అప్పుడు సమయం అర్థరాత్రవుతోంది. సోఫామీద కూర్చున్న వరప్రసాదం ముందురోజు రాత్రి నిద్రలేకపోవడం, అలసటవల్ల తనకి తెలియకుండానే నిద్రలోకి జారుకున్నాడు.

*　　　*　　　*　　　*　　　*

"ట్రింగ్ ..... ట్రింగ్" మంచి నిద్రలో వున్న డాక్టర్ ఫోన్ మోతకి నిద్రాభంగమై బద్ధకం, విసుగూ కనబరుస్తూ ఫోనందుకున్నాడు.

"హలో" అన్నాడు.

“ ..... ..... ”

“ఆఁ మీరా? చెప్పండి ఏమిటి ప్రాబ్లం?”

“ ..... ..... ..... ”

“ఈజిట్.”

“ ..... .....”

“సరే! మీరు ఉన్నపళంగా బయలుదేరి రండి ..... ” అంటూ వాళ్ళింటికి ఎలా రావాలో గుర్తులు చెప్పాడు.

వెంటనే మంచందిగి డ్రస్సప్పయి ..... భార్యకి నిద్రాభంగం కాకుండా బయట గదిలోకి నడిచి తన మెడికల్ కిట్ సిద్ధం చేసుకున్నాడు.

* * * * *

ఆదుర్దా, ఆందోళన, భయం ..... అభిరాంని వుక్కిరి బిక్కిరి చేస్తుండగా కారుని సుడిగాలిలా తోలుతున్నాడు. అర్థరాత్రి కావటంతో దాదాపు రోడ్లన్నీ ఖాళీగా వున్నాయి. పేవ్‌మెంట్‌లమీదా, దుకాణాల ప్రాంగణాలలో పడుకుని వున్న బిచ్చగాళ్ళు, చిల్లర దొంగలు బాణంలా దూసుకుపోతున్న కారు ధ్వనికి అటు నుంచి ఇటు తిరిగి పడుకుంటున్నారు.

* * * * *

“ధన్ ..... ధన్ ..... ధన్ ..... ధన్ ..... ” చెవులు బద్దలయిపోయేటంత శబ్దం రావటంతో వరప్రసాదానికి మెలకువ వచ్చింది. ఒక్కక్షణం అతనికంతా అయోమయం అయిపోయింది.

మహదేవ్ గది నుంచి మళ్ళీ విన్పించిందా చప్పుడు.

ధన్‌ధన్ ..... ధన్ ధన్ ..... ధన్‌ధన్

ఏం చేయాలో తోచలేదు అతనికి. ‘మహదేవ్ కానీ బయటకొస్తే తను నిలవరించగలడా? లేదు! అతన్ని ఆపటం తన వల్లయ్యే పనికాదు. అంత నీరసంలో సయితం అభిరాంలాంటి ఎత్తయిన, బలమైన మనిషిని బంతిని విసిరినట్లు విసిరేసిన మనిషికి తనేపాటి’ అనుకున్నాడతను.

ఏమి చెయ్యలేక మహదేవ్ గది వంకే చూస్తూ వుండిపోయాడు. ఏ క్షణంలో అయినా తలుపులు విరిగిపోయేలా వున్నాయి.

* * * * *

‘కీచు’మని ఆగిన కారు శబ్దానికి బయటకు నడిచాడు డాక్టర్. చీకటిలో ప్లాన్ నెంబర్ కనపడక రెండు ఇళ్ళవతల ఆపాడు అభిరాం కారుని.

“అభిరాం! ఇక్కడా ..... ” పిలిచాడు డాక్టర్.

బాణంలా రివర్సయి అతని పక్కనాగింది కారు! అతన్నెక్కించుకొని వింటి నుంచి వెలువడిన శరంలా మహదేవ్ ఇంటివైపు దూసుకుపోసాగింది.

ఆ స్పీడు చూసి భయంవేసింది డాక్టర్‌కి. ఓరగా అభిరాం వంక చూశాడతను. అతని

మొహం-చెమట, నుదురు మీద తగిలిన గాయం నుంచి కారిన రక్తంతో భయంకరంగా వుంది. అతనిపై నుంచి దృష్టిని స్పీడో మీటర్ మీదికి ప్రసరించి నిర్ఘాంతపోయాడు ..... వందకిలోమీటర్ల పైనే చూపుతుందది.

* * * * *

ఇంక కొన్ని క్షణాలు చాలు ..... ఈ తలుపులు విరిగిపోవటమో, గడియ వూడొచ్చేయడమో ఏదో ఒకటి జరుగుతుంది. మహదేవ్ బయటకి వచ్చేస్తాడు. ఎలా అతన్ని తను ఆపాలి? ఎలా ..... ఎలా ..... అనుకున్నాడు వరప్రసాదం.

"ధన్ ..... ధన్ ..... ధన్ ..... ధన్ ..... ధన్ ..... "

నిశ్శబ్దంలో భయంకరంగా విన్పిస్తోందా చప్పుడు. వరప్రసాదం ఎలర్ట్‌గా చూస్తున్నాడు. అతనికో అయిడియా వచ్చింది. వెంటనే బయటనుంచి ఒక్కో ద్వారం మూసేస్తూ హాల్లోకి వచ్చాడు.

హాల్లోంచి మిగతా దారుల గుండా వెళ్ళే ద్వారాలు మూసేసి సోఫామీద కూర్చుని చూడసాగాడు-- ఒకవేళ ఈ తలుపులు విరిగిపోయిన మిగతావి అతన్ని అభిరాం వచ్చేదాకా ఆపుతాయని. లోపల నుంచి భయంకరంగా అరుస్తున్నాడు మహదేవ్. ఆ సమయంలో వరప్రసాదానికేం చేయాలో పాలుబోవటంలేదు.

"ధన్ ..... ధన్ ..... ధన్ ..... ధన్ ..... " వరప్రసాదం చూస్తుండగానే ఒక తలుపు విరిగిపోయింది. ఒళ్ళంతా రక్తసిక్తమయిపోయి వున్నాడు మహదేవ్. ఇక చేతుల సంగతి చెప్పనవసరంలేదు ..... రక్తపు ముద్దల్లా మారిపోయాయి తలుపుల్ని బాది బాది.

చూడలేకపోయాడతనా దృశ్యాన్ని. ఏదో ట్రాన్స్‌లో వున్నట్టు ఒక్కో అడుగు వేసుకుంటూ హాల్లోకి రాసాగాడు మహదేవ్. అతని గొంతు నుంచి 'గుర్రు'మనే శబ్దం ..... ఆ నిశ్శబ్దం ఎంతటి ధైర్యవంతుడినైనా భయవిహ్వాలుడిని చేయక మానదు.

మహదేవ్ చూపు గదంతా కలియదిరిగి వరప్రసాదం మీద పడింది. క్రోధంగా చూస్తూ ముందుకు రాసాగాడు. వరప్రసాదం బొమ్మలా చూస్తుండిపోయాడు. ఎటూ పోవటానికి లేదు.

మహదేవ్ ఒక్కో అడుగు వేస్తూ గుర్రుపెడుతూ, అతన్ని సమీపించసాగాడు. వరప్రసాదం వెనక్కి వెనక్కి నడుస్తూ మహదేవ్‌కి అందకుండా జరగసాగాడు.

'ధన్ ..... ' మహదేవ్‌నే గమనిస్తూ వెనక్కి నడవటం వల్ల టీపాయ్‌ని గుద్దుకుని వెనక్కి పడిపోయాడు వరప్రసాదం. మహదేవ్ భయంకరంగా అరుస్తూ, వరప్రసాదం మీదికి వస్తున్నాడు.

ఇంకొక్క అడుగు ముందుకువస్తే తను అతనికి చిక్కిపోతాడు. తనని హతమార్చి మిగతా తలుపులు కూడా తీసుకుని బయటపడిపోతాడు మహదేవ్' అనుకున్నాడతను. సరిగ్గా అప్పుడు ..... అప్పుడు వినిపించింది అభిరాం గొంతు .....

"వరప్రసాదం గారూ ..... " అంటూ తర్వాత తలుపుల్ని గబగబ బాదుతున్న శబ్దాలు.

అంతే! పోయిన ఉత్సాహం ప్రవేశించింది అతనిలో. ఒక్క వుదుటున లేచి ముందుకు పరుగెత్తాడు.

అతన్ని అందుకోవాలని చేయిసాచిన మహదేవ్ ఆ ప్రదేశం నుంచి వరప్రసాదం తప్పించుకోవడంతో తూలి ముందుకు పడిపోయాడు.

ఈలోపు హాలు తలుపులు తీసుకుని బయటికెళ్ళి, అక్కడి నుంచి ప్రధాన ద్వారం తెరిచాడు.

ఎదురుగా అభిరాం, అపోలో హాస్పిటల్ డాక్టర్ కన్పించి దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు.

“మహదేవ్‌కెలా వుంది?” అంటూ లోపలికి నడిచాడు అభిరాం. అతన్ని అనుసరించాడు డాక్టర్.

“ఓమైగాడ్!” రక్తపు ముద్దలా పడివున్న మహదేవ్‌ని చూసి బాధగా మూలిగాడు అభిరాం.

డాక్టర్ కూడా అతన్ని చూసి ఆశ్చర్యంతో నోరు తెరిచాడు. “అసలేమయింది?” అనడిగాడు మహదేవ్‌కి వైద్యం చేయడానికి కిట్ ఓపెన్‌చేస్తూ.

“డాక్టర్! నాదొక సలహా” అన్న వరప్రసాదం మాటలకు అభిరాం, డాక్టర్ ఇద్దరూ అతని వంక ‘ఏమిట’న్నట్టు చూశారు.

“అటు చూడండి” మహదేవ్ విరిచేసిన తలుపువంక చూపించాడతను.

అటు చూసి ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

“ఇతనికి వైద్యం చేసేముందు మత్తుమందు ఇవ్వండి. లేకపోతే ఇతన్ని ఆపలేం” అన్నాడు.

డాక్టర్ కిట్‌లోంచి పెంథటాల్ తీసుకుని డిస్టల్ వాటర్‌తో కలిపి, మహదేవ్‌కి ఇంజక్షన్ చేశాడు.

“ఇప్పుడు ఫర్వాలేదు. అతను మరో ఎనిమిది గంటల దాకా మత్తులో వుంటాడు” అంటూ అతని గాయాలను క్లీన్ చేసి మరొక ఇంజక్షన్ చేసాడు.

చిత్రంగా ఇంకా అతని శరీరం రక్తాన్ని చిందిస్తూనే వుంది. వింతగా చూశాడతను. ఎన్నిసార్లు క్లీన్ చేసినా రక్తం వస్తూనే వుంది.

“ఆశ్చర్యంగా వుందే బ్లడ్ క్లాటింగ్ సిస్టమ్ దెబ్బతిన్నట్టుంది” అంటూ స్ప్రేబ్లడ్ క్లోజర్‌తో అతని రక్తస్రావాన్ని ఆపాడు. అది కృత్రిమంగా మనిషి రక్తస్రావాన్ని అపుతుంది.

తరువాత అతని చేతులు కూడా క్లీన్ చేసి మందువేసి కట్టుకట్టాడు. వరప్రసాదం, అభిరాం, డాక్టర్ కలసి అతన్ని ఎత్తుకుని తీసుకెళ్ళి మంచం మీద పడుకోబెట్టారు.

“డాక్టర్! ఇందాక చాలా చిత్రంగా మాట్లాడాడు మహదేవ్” అన్నాడు అభిరాం.

“ఏమని?” కుతూహలంగా అడిగాడతను.

“వింత వింతగా ప్రవర్తించి నన్నూ, ఈయన్ని కొత్తవాళ్ళని చూసినట్లు చూసి మహదేవ్ పేర్లడిగాడు. నేనతని పేరేమిటంటే తను లెనిన్‌నని, సోవియట్ యూనియన్ స్థాపకుడినని

అన్నాడు ..... ” చెప్పాడు అభిరాం.

“దానికంటే ముందు ఇనీసా ఆర్మండ్, కృపస్కయ అన్న మాటలు వచ్చాయతని నోటంట. మనిషి కూడా ఆంగ్లంలోనే మాట్లాడాడు.” అని చెప్పాడు వరప్రసాదం.

ఆ మాటలు విని ఏదో అర్థమయినట్టు చిన్నగా నవ్వాడు డాక్టర్.

“ఇనీసా ఆర్మండ్ అంటే లెనిన్ ప్రియురాలు. ఇక కృపస్కయ అంటే లెనిన్ భార్య. ఫ్రాన్స్‌కు చెందిన ఇనీసా ఆర్మండ్‌ని లెనిన్ ప్రేమించటం మొదలుపెట్టాక భార్య కృపస్కయను నిర్లక్ష్యం చేశాడు. 1911లో పారిస్‌ను సందర్శించిన లెనిన్‌కు ఇనీసాతో పరిచయమై తరువాత ప్రేమగా మారింది.

సంవత్సరం పాటు వారి ప్రేమ పారిస్‌లోనే కొనసాగింది. కానీ ఆ ప్రేమను అలాగే కొనసాగించడం లెనిన్‌కు ఇష్టంలేకపోయింది.

ఎందుకంటే ఇనీసా స్నేహంతో తన దృష్టి విప్లవం నుంచి మరలుతుందని భయపడి 1912లో ఆమెని మరచిపోవాలని ప్రయత్నించాడు.

కానీ అది సాధ్యంకాలేదతనికి. అప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో- ఆమెని క్రెమ్లిన్‌కి రప్పించాడు. బోల్షివిక్కులు అధికారంలోకి వచ్చిన తర్వాత భార్య కృపస్కయ, చెల్లెలు మరియా వుంటున్న నివాసానికి ఇనీసాను తీసుకువచ్చాడు. వీరంతా క్రెమ్లిన్‌లో ఒకే యింట్లో వున్నట్లు ఆధారాలు లభించాయి.

ఇనీసా అద్భుతమైన తెలివితేటలున్న విద్యాధికురాలు. అందర్నీ ఆకట్టుకునే రూపవతి. ప్రియురాలి మోజులో పడి తనని తృణీకరించినా భర్తపట్ల తన ప్రేమ సడలనివ్వలేదు కృపస్కయ.

అయితే 1919లో ఇనీసా కలరా వ్యాధితో మరణించింది. ప్రియురాలి మరణం లెనిన్‌ను బాగా కృంగదీసింది. దాంతో ఆయన మానసిక నిబ్బరం కోల్పోయి మునుపటిలా రాజకీయ నిర్ణయాలు తీసుకోలేకపోయేవాడు. అవసానదశలో వ్యాధి బారిన పడిన లెనిన్‌కు భార్యే సేవలుచేసింది. 1924 జనవరి 21న లెనిన్ మరణించాడు.

తనని ఈసడించుకున్న భర్తనే ప్రేమించిన ఆమె లెనిన్ భౌతికకాయాన్ని ఇనీసాను ఖననంచేసిన చోటే రెడ్‌వాల్ దగ్గర ఖననం చేయించి మరణించాక కూడా వారిద్దర్నీ కలిపింది.

యూనివర్శిటీ ఆఫ్ లండన్‌లోని స్కూల్ ఆఫ్ స్లోవోనిక్ అండ్ ఈస్ట్ యూరోపియన్ స్టడీస్‌కు చెందిన రష్యా చరిత్ర ప్రొఫెసర్ రాబర్ట్ సర్వీస్ అవిశ్రాంతంగా పరిశోధనలు చేసి లెనిన్ వ్య క్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని నిజాలు వెలుగులోకి తెచ్చాడు.